# గజపతుల గాథ

నగారాఖానా బయట సిపాయి ఐదుఘంటలు బజాయించాడు. దర్వాజా తెరవడానికి ఇంకా చాలా సమయం ఉంది. కోట ముఖద్వారం ముందు కాపలాకాస్తున్న సిపాయి నడుం బిగించుకున్నాడు. ఆ చేతిలోని బల్లెం ఈ చేతుల్లోకి మార్చుకుని తలఎత్తి నగారాఖానా వంక చూపు సారించాడు. తూర్పు తెలతెలవారుతోంది.

'' ప్రభువులు నాలుగు వెయ్యకముందే వెలగాడ కొండకి విజయంచేశారట....'' ఘంట వేసిన సిపాయి పహారా వాడితో చెప్పాడు.

'' అలాగా ! నడుస్తుండగానే మోగన్నుపడిందే అనిటొచ్చా !''

సిపాయి సింహాచలానికి ఒళ్లు వేడెక్కింది. రాత్రి నౌకిరీ ఏనాటి నుంచో అలవాటయినదే... చిరు చెమట పట్టింది. ప్రభువుల తీరేవేరు. సందడి చెయ్యకుండా వారు కోట నుంచి బయటికి వెళ్లడంలో ఆశ్చర్యం లేదు ..... ''

''కానీ.....''

'' గాభరా పడుకురా, అబ్బీ....పడఁవటి దరవాజా నుంచి ఏలిన వారు బయలుదేరినట్టుగా గస్తీ మారిన మా బావమరిది నాతో చెప్పాడు. అంతేకాదు మావాణ్ణి చూసి ఆ కట్టేమిటి గాయం ఎలా తగిలింది ? అని ఏలినవారు అడిగారట. మనవాడు చెప్పినది విని కుమందాన్ కాలు గాలినపిల్లిలా తిరుగుతున్నాడట. వెలుగు రావడం కోసం.''

ఘంట దగ్గర సిపాయి ఆపనిలోకి మరొకరు రావడంతో సింహాచలాన్ని అతగాడి ఆలోచనలకే వదిలేసి వెళ్ళిపోయాడు.

సింహాచలం పనిలోకివస్తూనే ఉన్నాడు.

నగారామోతలకు తుళ్లిపడి ప్రస్తుతంలోకి వచ్చాడు. ఏమో చిన్న సన్నటి వాసన.... ఓ రోగిష్ వాసన.... ఏదో తీపి వాసనలా ఉంది

బాగా వెలుతురు వచ్చేసింది.

''ఎవరది ?''

'' ........''

''నువ్వెవరివి ; ఎంతసేపయింది నువ్ వచ్చి ?''

''.....''

''మాటాడవేం ?'' బల్లెంమొన అతగాడి గుండెమీద మోపబోయి నిదానంగా అతని వంక చూశాడు.

ముక్కు కొరుక్కుపోయి రెండు రంధ్రాలే కనబడుతున్నాయి. కళ్లు గుంటలు పట్టి ఉన్నాయి. చేతివేళ్లు పోయినవి పోగా మిగిలినవి మెలికలు తిరగిపోయాయి. తలచుట్టు గుడ్డ. పాదాలు లేనేలేవు. అతను నడవగలగడమే ఆశ్చర్యమనిపించింది.

సింహాచలం గుండెదడదడలాడింది. బల్లెం కోల నేలకానించి వచ్చిన మనిషి వంక తీక్షణంగా చూశాడు.

''మాటాడతావా లేదా ? ఎవరునువ్ ?''

''కోప్పడకు బాబూ. ప్రభువు దర్శనం కోసం శానా దూరం నుంచి వచ్చా. పదిహేను కోసులు .... ప్రభువుల తో నే వచ్చినట్లు చెప్పవూ ? ''

''కందకం ఒడ్డున కూచో. ప్రభువులు వచ్చేటప్పుడు కనడవచ్చు''.

''లోనకి కబురు.....''

''నోర్ముయ్ !...జబ్బువాడని దయచూపాను. రాజ నగరిలోకి ఎందుకొచ్చావు ?''

– ఆ అదలింపుతో ఆమనిషి ఎటుపోయాడో సింహాచలం తిరిగి చూసేసరికి మరికనపడలేదు.

–''పుచ్చెలెగిరి పోతాయి ఏమనుకున్నావో...''

''ఎంత విచిత్రం ... ప్రభువుల మనసు తెలుసుకో లేకపోవడం నేరమే కాదు, పాపంకూడా !''

''వాడికేం తెలుసు. కుర్రనాగమ్మ ... కొత్తగా నౌకిరిలో ప్రవేశించాడు. రాజదర్బారు, కోట, ఏకాంత మందిరం – పూజాగృహం ... ప్రభువుల ఇష్టా యిష్టాలు ... ఇవేమీ తెలియని మనిషి ప్రభువుల సామీప్యంలో ఉండడం ఎంత అనర్థమో చూడు !''.

''ఇంతకీ జరిగినదేమిటో '' పైన వేసుకున్న కాశ్మీరు శాలువా నడుంచుట్టూ కట్టుకుంటూ ముందుకెళ్లారు శాస్త్రులవారు.

'' ఏలినవారు ముద్ద ముట్టడం లేదట !''

''కుమందాన్ని దర్శనం చెయ్యమని శెలవిచ్చారట. కాని ప్రభువులు మందిరంలోకి ఎవరినీ ప్రవేశపెట్ట వద్దని అజ్ఞాపించారు.

''ఏమైందబ్బా! '' శాస్త్రులవారు బంటురౌతుల తర్జన భర్జన దాటి ముందుకు సాగారు.

మందిర బహిర్ ప్రాంగణంనుంచి కోట ముఖద్వారం వంక చూస్తూ ప్రభువులు ఏమో ఆలోచిస్తూ ఉండడం శాస్త్రుల వారి కంట పడింది.

ఏలినవారి బంటు ఒకడు పరిగెత్తుకు వచ్చి ''తమను లోపలికి దయచెయ్యమని ఏలినవారి శెలవయింది ''. అంటూ శాస్త్రులవారికి విన్న వించుకున్నాడు.

'' ప్రభువులకు జయం! ''

''దయ చెయ్యండి !''

''తమ మనసు ...''

'' కష్టాలు మరొకరికి చెప్పివారికి కష్టం కలిగించడం మాకు నచ్చదు.''

''కుమందాన్ తన దర్శనం కోసం...''

'' వారి పొరపాటు ఈసరికే తెలుసుకునే ఉంటారు. గాయపడిన వ్యక్తికి వైద్యసహాయం నగరులో అందించ లేకపోవడం అధికారులకు తగదు....''

'' ప్రభువుల శెలవయితే .... '' శాస్త్రులవారు ఒక్కక్షణం బయటకు వెళ్లి తిరిగి వచ్చారు.

''ఎవరో రాజదర్శనం కోసం వచ్చి నిరాశతో దీనంగా వెనక్కి వెళ్లినట్లు తోస్తోంది...'' ఏలిక గొంతులో, పొరపాటు జరిగిందన్న విషాదం.

'' ప్రభువులు ఆనంద క్షితీంద్రులు ... తమ దర్శనం అందరికీ సాధ్యమా ? దర్శనమాత్రంచే ఆనంద డోలికలలో తేలించే ప్రభువులు ఆంధ్ర భోజులు... ప్రభువులు మన్నించాలి. తమ ప్రభువు భృకిటి ముడి ఎదుటివాడి రక్తాన్ని గడ్డ కట్టిస్తుంది.... రోగిష్టి వాళ్లు – ఉన్మాదులు ... యాచకులు వీరిని దూరంగా ఉంచవలసిన అవసరం ఏలినవారి భృత్యులందరి మీదా ఉంది.''

'' కోరినవన్నీ ఇవ్వడం సాధ్యపడక పోయినా, ఇవ్వగలిగినవి – ఇవ్వదగినవి ఇవ్వకుండుట, పాత్రత నెరుగకుండుట తప్పిదాలేమో !''

'' పిచ్చివాడికి పాత్రతా ?''

'' తమకు పిచ్చివాడని ఎలాతెలుసు ?''

'' క్షమించాలి ...''

''శాస్త్రులవారూ ... ఓహో అప్పయ పంతులుగారా ? దయచెయ్యండి.... ఆసీనులు కండి !''

'' ప్రభువులు ముద్ద ముట్టడంలేదని తెలిసి ....''

'' అవైనం ....'' శాస్త్రులవారు బిత్తరపోయి చూస్తుంటే అప్పయ్య పంతులుగారు '' ప్రభూ... మరొక కాసేపటిలో తమ మనసులోని మెర మటుమాయమైపోతుంది... నేను ఆ ప్రయత్నంలో మళ్లీ తమ దగ్గర శెలవు తీసుకోకతప్పదు ....''

'' వెళ్లి రండి ... శాస్త్రుల వారిలో కొంచెం చర్చించవలసిన పని ఉంది.''

శాస్త్రి గారికి గుండెలో దడ మొదలైంది. ప్రభువులకు ఇలాంటి మనతో స్థితి కలగడల అడపా తడపా కద్దు . ఈ స్థితిలో వారితో మాటాడగలిగినవారు వారి గురువు ముడుంబస్వామి గారే కాని వారెలా ... ఇప్పుడది సాధ్యం కాదు.

''శాస్త్రులవారు ! మారకం కలగ చేసే గ్రహస్థితి గమనించి కూడా అంతా భేషుగ్గా ఉందనడం రాజభక్తికి నిదర్శనమా పిరికి తనానికి సాక్ష్యమా ? తమరు శాస్త్రపరిజ్ఞానంలో నిష్ణాతులని మాకు తెలియదా ?'' ప్రభువులవాక్కులో కించిత్ ఆగ్రహం తొణికిసలాడింది. శాస్త్రి గారికి చిరుచెమటలు పడుతుండగా....

'' కాదు మహాప్రభో ! ప్రభువులు కొంచెం విశ్రాంతి తీసుకుంటే బాగుంటుందని మా మనవి. అప్పరాయ పంతులు గారు తమకు నివేదించినట్టు కొద్ది సేపటిలో తమ మనసు కుదుటపడే అవకాశం కలుగుతుంది.''

'' అందుకే ఉదయాన్నే వెలగాడ వెళ్లాం....''

'' ప్రభువులు ఒక్క ఘడియపాటు విశ్రాంతి తీసు......''

'' మంచిది వెళ్లిరండి !''

శాస్త్రులవారు మెల్లగా నిట్టూరుస్తూ బయటకు నడిచారు.

– '' ప్రభూ ! మీ మనసులోని మనిషి తమ దర్శనం కోసం ప్రాంగణంలో సిద్ధంగా ఉన్నాడు. ప్రవేశపెట్టమని శెలవయితే ....''

'' మేము బయలుదేరి వెళతాం... తమరిక్కడే ఉండండి ... తమ దగ్గర మాకు రహస్యాలేమీ లేవని తమకీ తెలుసు ...''

దీర్ఘాలోచనలో ఉన్న మహారాజు వంక కొంచెం తత్తరపాటుతో చూశారు అప్పరాయ

పంతులుగారు.

–'' ప్రభువులకు చిన్నగాడి దండాలు!'' వేళ్లుపోయినా అరచేతులు జోడిస్తూ అన్నాడతను.

'' మా వల్ల జరిగిన తప్పిదాన్ని క్షమించమని వేడుకుంటున్నాం.''

'' అదేమిటి ప్రభూ ! ఎంత మాట శెలవిచ్చారు ? తమ దర్శనం చేద్దామన్న సంకల్పం కలిగింది. ఈ.రోజు నా అదృష్టం పండింది.''

'' అంటే ! ఆ అదృష్టం మీదనే మమ్మల్ని నమ్మమంటారా ?''

'' ప్రభువులతో వాదించగలిగిన వాడిని కాను. సింహాచలం కొండ మీద కొన్నేళ్లుగా ఉంటున్నాను. మొన్న ఓ విచిత్రం జరిగింది ప్రభూ !... కొండవారగా ఓ దగ్గర మూడు బండలు విడివిడిగా పేర్చినట్టున్నాయ్ !

'' ఒక్కొక్క బండ సుమారు నిలువెత్తు ఉంటుంది. నేను రోజూ చూసేవే అవి. ఎప్పుడూ లేనిది ఓ బండ మీద ఒక ఋషీశ్వరుడు కనిపించి దగ్గరకు పిలిచాడు – చేతి సైగతో ... సమీపించాను.... ఆయన ముఖం లో దివ్యతేజస్సు ... ఆయన సైగ చూసి తలతిప్పి చూశాను. మరొక బండమీద మరొక తపస్వి ... ఆయన ముఖంలో వెలుగు కళ్లు మిరుమిట్లు గొలిపింది... ఆయన మూడవ బండ వంక సైగచేసి చూపారు ... మిమ్మల్ని చూడాలనిపించింది... ఇక్కడే కాదు ... అక్కడ – ఆబండ మీద ... ఏలినవారి పూర్వీకులను చూశా ... మిమ్మల్ని అక్కడ వారిలో కలుపుకోవాలని వారి ఆకాంక్షగా వారి చూపులు నాకు సందేశాన్నిచ్చాయి. 'చిన్నా మీ ఏలికనొచ్చి మూడవ పీఠం అలంకరించమని చెప్పరా ! నీ జన్మ తరిస్తుంది.' అని వారు శలవిస్తున్నట్టు అనిపించింది.

'' ఏలినవారికి ఈ మాట చెప్పగలిగితే నాజన్మ ధన్యమౌతుందని ఏమీ తెలియని నాకే అనిపించింది. అడుగు తీసి అడుగు వెయ్యలేని రోగిష్టి మనిషిని ... దూరమా బోలెడు... అయినా ఇది సాధ్యమైంది. ఆ మహానీయుల సంకల్పం... నా జన్మ ధన్యమైంది..... శెలవు.''

– ప్రభువులు ఏకాంతంగా కూచోవడం అప్పరావు పంతులుగారికి ఆశ్చర్యం కలగజేసింది. ఆ రోగిష్టి సందర్శకుడు ఉంటాడన్న ఆలోచనతో ప్రభువుల చెంతకు చేరారాయన. మొట్టమొదటి సారిగా ప్రభువులు వారి ఆసనంలో లేరు. శయన మందిరానికి వేంచేశారని బయటచెప్పగా అప్పరాయ పంతులు గారు ఖిన్నులై, ప్రభువుల ఏకాంతాన్ని భంగ పరచ నిచ్చగింపక కోట వదిలి గృహోన్ముఖులైయ్యారు,

ఆ క్రిందటి రోజు వారి సంభాషణ మనసులో అలా మెదులుతూనే ఉంది.

–'' శాస్త్రం తెలిసీ, విషయం తెలిసీ చెప్పకపోవడం క్షంతవ్యమేనా? అప్పారావు పంతులుగారూ తమరు ... ''

'' చెప్పక పోవడం వెనక ఉన్న కారణం తెలుసుకోవడం అవసరమేమో ! తమకు చెప్పదగిన వాడిని కాను ... మనకు తెలియనివి అర్థంకానిది శాస్త్రం సమ్మతించినవీ, సమ్మతించనివీ ఎన్నో ఉంటాయి. తమను కలవరపెడుతున్న ఆలోచన ఏమిటో ...'' అంత కంటే ప్రశ్నను పదును చేయడం ఇచ్చగించక పంతులుగారు ఆగిపోయారు.

'' విధి బలీయం. దైవేచ్ఛ అప్రతిఘటనీయం. దయాళువైన భగవంతుడు సదా జగత్

కల్యాణకారకుడే... మా మనసు కుదుటపడ్డది. శాస్త్రులవారి ఆజ్ఞ శిరోధార్యం. జ్వర సూచనలు పొడచూపుతున్నాయి. విశ్రాంతి తీసుకోవడం మేలేమో!''

''ప్రభువుల వద్ద శెలవు తీసుకుంటా!'' పంతులుగారు లేచారు. ప్రభువులు సాదరంగా మందిరం ద్వారం వరకూ పంతులు గారిని సాగనంపారు.

వైశాఖలక్ష్మి ప్రశాంతంగా ప్రకృతి శోభను ఇనుమడింపచేస్తోంది.

ప్రభువులు రోజంతా ఏకాంత మందిరంలో ఉండడం ప్రభువుల అంతరంగికులందరి కంటిలో నలుసైంది.

'ఉదయాన్నే లేస్తూ శాస్త్రులవారు' ఎడమకన్ను అదురుతోంది సోమీ 'అంటూ స్వామి దేవమ్మ గారితో చెప్పారు.

అప్పారావుగారు శాలువా కప్పుకుని ప్రాతః వాహ్యాళికి బయలుదేరారు.

''పంతులుగారూ, పంతులుగారూ! కొంపమునిగింది. ప్రభువులు తెల్లవారకుండానే వెలగాడ కొండకి బయలుదేరారట వైద్యుల మాట లెక్కచెయ్యక యవనాశ్వాన్ని సిద్ధం చెయ్యమని త్వరపెట్టి చేశారట. మెట్లెక్కుతుండగా క్రిందపడిపోయారట ప్రభువులు. ఎకాఎకిన నగరుకు తీసుకొచ్చారు బగ్గీలో.... జ్వర తీవ్రత వల్ల తూలిపోయారని నమ్మినబంట్లు చెప్పారు. పెద్ద డాకటేరుకు తీసుకొచ్చేసరికే అంతా అయిపోయిందట!'' బంటు కళ్ల నీళ్లు తిప్పుకుంటూ చెప్పాడు.

- పంతులుగారు చటుక్కున వెనుదిరిగి శాస్త్రిగారింటికి వెళ్లారు. ఆసరికే శాస్త్రిగారు కోటకు బయలుదేరుతున్నారు.

ప్రభువులు పరమపదించారన్న వార్త నగరంలో కార్చిచ్చులా సుడులు తిరుగుతోంది.

ప్రభువులు తమతో జాతకం లో మారకం గురించి చర్చించడం, సింహాచలం కొండలమీద నుంచి కుష్టురోగి దర్శనానికి రావడం - ప్రభువులకి మూడో బండ మీదకి పిలుపు రావడం. వారికి రాబోయేది చాలా ముందుగానే తెలుసుననడం విడమరిచారు శాస్త్రిగారు.

''ప్రపంచంలో నుంచి ఓ మహోజ్జ్వలమయిన వెలుగుమటుమాయమైంది....''

ఈ మాట చెబుతూ అప్పారావు పంతులుగారి గొంతు పూడుకు పోయింది.

**ఆకాశవాణి, విశాఖపట్నం ప్రసారం**

8-4-1993